ఎక్కి ప్లాట్‌ఫారం ఎక్కి డమ్మీ దండని అవలీలగా మహబూబ్ ఆలీఖాన్ విగ్రహం మెడలో వేసేశారు.

అంతకంటే అవలీలగా దిగిపోయి "సోదర సోదరీమణులారా!" అని ఉపన్యాసం రిహార్సలుకి నాంది పలికారు.

"మనం ఇక్కడ కొంచెంసేపు గడుపుదాం, వీరందరినీ వాళ్ల పనుల మీద ఉండమని పంపించెయ్యండి" అన్నాడు సహదేవరావు. వాళ్లు వెళ్లిపోయారు.

"చూడండి, లక్ష్మణరావు గారూ! రేపు ఇలా జరగదు!!" అన్నాడు సహదేవరావు.

"ఏం?"

"నేతాజీ విగ్రహం ఇలా ప్లెయిన్‌గా ఉండదు. మన దేశం మొత్తం మీద ఎక్కడ నేతాజీ విగ్రహం ఉన్నా చూడండి; ఆయన యూనిఫాంలో నిలబడి, కుడి చేత్తో సెల్యూట్ కొడుతున్న భంగిమలోనే ఉంటుంది. ఆయన కుడి చెయ్యి నుదుటికి ఆనించి ఉండడం వల్ల మీరు ఎంత ప్రయత్నించినా దండని ఆయన నడుంకి వెయ్యగలుగుతారు తప్పా మెడలో వెయ్యలేరు."

"చచ్చాం, పో!" అని లాన్స్‌లోనే కూలబడ్డారు మినిస్టరు గారు. వెంటనే ఆ లాన్స్ మెత్తదనం మమ్మల్నీ అనుభవించమన్నట్టుగా "కూచోండి" అన్న సంజ్ఞచేశారు. "పోనీ - పూలదండలో దారం దాగుందని తెలుసును - అని కవి అన్నాడు కదా! ఆ దారం కాస్త పొడుగ్గా పెట్టించి కొసలు రెండూ విడిగాపుచ్చుకుని ప్లాట్‌ఫాం ఎక్కేక ఆ రెండు కొసల్ని నేతాజీ మెడలో ముడి వేస్తేనో?" అన్నాను.

"అప్పుడు ఇంకా అపహాస్యం పాలవుతాం. 'నేతాజీకి తాళికడ్తున్న మినిస్టర్' అని ఏ పత్రిక వాళ్లో ఫోటోకింద కాప్షన్ రాస్తారు. అబ్బో; వద్దు;" అన్నారు లక్ష్మణరావు.

వెల్‌క్రో అనే మేల్ - ఫిమేల్ క్లిప్పర్స్ దారానికి ఉండే రెండు కొసలకీ అమర్చి కన్నుమూసి తెరిచేలోగా పని పూర్తి చెయ్యవచ్చునని సహదేవరావు బోధ పరిచాడు. మినిస్టర్ లక్ష్మణరావు ఆ ఉపాయం తన "దండ" నాయకులకి చెప్పడానికి పరుగెత్తారు.

"ఇంతకీ నేతాజీ మీద ఈయన కెందుకో ఇంత భక్తి?" అన్నాను.

"ఆయన నేతాజీ; ఈయన చేనేతాజీ!" అన్నాడు సహదేవరావు; చేనేత, జౌళి పరిశ్రమల మంత్రి లక్ష్మణరావును సమర్థిస్తూ.

★

# 54. 'నీవుండేదా కొండపై!'

**"అ**న్నట్టు, మొన్నీ మధ్య కొండలరావు కనబడ్డాడోయ్" అన్నాడు కాశీపతిరావు; మేం ఇద్దరం ఆ కాఫీహోటల్లో పావుగంటసేపు కబుర్లు చెప్పుకున్నాక.

"ఏ కొండలరావు?"

"ఇంకెవడు; మన ఏడు కొండలరావే!"

"ఎక్కడ కనబడ్డాడు?"

"ఇంకెక్కడ సాక్షాత్తూ తిరపతిలోనే".

పక్క టేబిలు దగ్గిర కూర్చుని తన పని కానిచ్చుకుంటూనే ఇంత సేపూ మా సంభాషణ వింటున్నాడని నాకనిపించిన ఒక పెద్దమనిషి ఈ మాటకి చెంపలు వాయించుకోడం చూపించేను, కాశీపతి రావుకి. "నన్నయినా పిలిచేడు కాదు" అన్నాను మెల్లిగా అతని మీదికి వంగి.

"ఎందుకు?"

"లెంపలు వాయించడానికి!" అని నవ్వేను. "లేకపోతే, చూడు! ఏడు కొండలు కనిపించేడు; సాక్షాత్తు తిరుపతి లోనే - అని నువ్వు చెప్పేసరికి నీకేదో వెంకటేశ్వర స్వామే కనిపించినట్టు ఆ ఇది!" అన్నాను.

★★★

చదువుకుంటున్న రోజుల్లోనే మా క్లాస్‌మేట్ కొండలరావుకి ఎవరో "ఏడుకొండలరావు" అని నిక్ నేమ్ పెట్టేరు. పెట్టేరంటే, పెట్టరా మరి? చదువులోనూ, రాతలోనూ- పుస్తకానికీ పుస్తకానికీ మధ్య, పేజీకి పేజీకి మధ్య కొండలరావుకి, తన ఎడం చేతి అనామికకి ఉన్న ఉంగరంలోని మినీ వెంకటేశ్వర బొమ్మని కళ్లకద్దుకొనే అలవాటు.

పొద్దున్నే లేవగానేనూ, క్లాసుకి గాని బైటికి గాని వెళ్తున్నప్పుడూనూ, అట్నుంచి రాగానేనూ; రాత్రి నిద్రపోయేటప్పుడూనూ - కొండలరావుకి; తన రూములో ఉన్న 24 ఇంటూ 18 వెంకటేశ్వర స్వామి పటం దగ్గిర స్టూలు వేసుకుని ఆ బొమ్మలో ఉన్న ఆ తిరువడిఘళ్ (పవిత్ర పాదాల) మీద కొన్ని డజన్ల ముద్దులు పెట్టే తీవ్రమైన అలవాటు.

ఎవరైనా రోడ్డుమీద కనబడి "గుడ్మార్నింగ్ గురూ" అంటే రెండు చేతులూ జోడించి "జై బాలాజీ!" అనో "వెంకటేశార్పణమస్తు" అనో రిప్లయి ఇచ్చే అలవాటు.

ఏ క్లాసుకి ఆ క్లాసుగా. పరీక్షలు అయిపోయిన మర్నాడు, రిజల్ట్సు ప్రకటించిన మర్నాడు, మళ్లీ కొత్త క్లాసులో చేరిన మర్నాడు - తిరుపతికి ప్రయాణం కట్టే అలవాటు.

ఇవన్నీ చాలనట్టుగా ప్రతీ ఏడాదీ వెంకటేశ్వరస్వామి బొమ్మ ఓ వైపూ. న్యూ ఇయర్ గ్రీటింగ్స్ రెండోవైపూ అచ్చేసి - నూట ఎనిమిది మందికి పంచిపెట్టే అలవాటు.

కొండలరావు నాపెళ్లికి హాజరైనప్పుడు జరిగిన సంఘటన నేను మరచిపోదామనుకున్నా కుదరదు.

అతను నా పెళ్లికి రావడం అందర్లాగా కాదు. అనగా; పెళ్లి పందిట్లో నాకో, ఫొటోలు తీసే అతని కెమెరాకో-కనబడి నాలుగు అక్షింతలు జల్లేసి వెళ్లిపోయే పద్ధతిలో రాలేదు. తతంగం అంతా పూర్తయిన దాకా ఉండి; నేనూ నా వధువూ ఖాళీ అయిన సమయం చూసుకుని; అప్పుడు తెచ్చి ఇచ్చేడు ఒక పటం. (వేరే చెప్పక్కర్లేదు కదా, అది వెంకటేశ్వర స్వామీ అలివేలు మంగా ఉన్న 24 ఇంటూ 18 బొమ్మ అని!)

నాకు కర్నూలు ట్రాన్స్‌ఫరైనట్టు ఆర్డరు వచ్చిందనీ మూడు రోజుల్లో అక్కడ చేరాలనీ మాటల సందర్భంలో అతనికి చెప్పేను. కొండలరావు చాలా బాధపడ్డాడు. పదహారు రోజుల పండుగయినా చేసుకోకుండా అంతదూరం వెళిపోవాలా అని ఎంతో ఇదయ్యాడు. నా జన్మ నక్షత్రం అడిగేడు. చెప్పేను. చెయ్యి చూపించమన్నాడు. చూపించేను. చేతిలో ఉన్న రేఖలు

చూస్తాడేమో అనుకుంటే అలా కాకుండా చేతికి ఉన్న నీలం రాయి ఉంగరం మాత్రం చూసేడు.

"ఇదెక్కడిది? ఇంతకు ముందు లేదనుకుంటానే?" అన్నాడు; నిర్ఘాంతపడి.

పెళ్లికి కొద్ది రోజులు ముందర జరిగిన ప్రధానం నాడు మా అత్తవారు ఆ ఉంగరం నాకు తగిలించేరని వివరించేను.

కొండలరావు వెంటనే ఆ ఉంగరం తీసెయ్యమన్నాడు. నీకూ నీలంరాయికీ పొత్తు కుదరదన్నాడు. "అదే నీకు శత్రువు. అందుకే, ఈ ప్రాంతంలో నీ కేటగిరీలో రెండు వందల పోస్టులు ఉన్నా నీకు కర్నూలు ట్రాన్సఫరైందన్నాడు. 'ఈ ఉంగరం ఇలాగే పెట్టుకుని ఉంటే కర్నూలు వెళ్లి అష్టకష్టాలు పడడం ఖాయం', అన్నాడు. నాకు అలాంటి నమ్మకాలు లేవంటే కూడా పట్టించుకోకుండా, క్షణాలమీద నా పక్కనే బెదురు కళ్లతో చూస్తూ కూచున్న 'ఆవిడ' కి నచ్చజెప్పి తీయించేశాడు. నిమిషాలమీద దాన్ని బజారుకి పట్టుకెళ్లి, నీలం రాయికాదు - అసలు ఏ రాయీ లేకుండా ప్లెయిన్‌గా ఉన్న ఉంగరం అంతే వెల గలది తెచ్చి నా వేలికి తగిలించేడు.

అంతే. ఇంక ఈ రాత్రి బయల్దేరి కర్నూలు వెళిపోడమే అని సిద్ధం అవుతూ వుండగా ట్రాన్స్‌ఫర్ ఆగిపోయిందని టెలిగ్రాం ఒచ్చింది. దాంతో; మా ఆవిడ ఏడుకొండలరావుని తల్చుకుని కళ్లుమూసుకుని అతనిచ్చిన పటాన్ని కౌగిలించుకుంటే కూడా ఏమీ అన్లేక పోయాను.

★★★

కాశీపతిరావు వెళ్లిన మర్నాడు సాక్షాత్తు ఏడు కొండలరావే దిగేడు; ఉదయమే వచ్చాడట. మూడు రోజుల్లో, మా సంస్థ ఆధ్వర్యాన జరగబోయే ఒకానొక శంకుస్థాపన కార్యక్రమపు ఏర్పాట్లు సక్రమంగా జరుగుతున్నాయో లేదో చూడమని మినిస్టరుగారు ఇతన్ని ముందుగా పంపించేరుట. కొండలరావు ఇప్పుడు ఆ మినిస్టరుగారి ప్రయివేటు ఆఫీసులో పని చేస్తున్నాడట. ఉదయం రాగానే మా ఆఫీసర్ గారి ఇంటికి వెళ్లి, తను ఇలా వచ్చినట్టు చెబితేనూ; ఆ ఏర్పాట్లన్నీ నేనే చూస్తున్నాననీ నన్ను కలవమని చెప్తే నా పేరు విని కొండలరావు కొండంత సంతోషపడి (ఒక్క కొండ కాదు, ఏడుకొండలంత!) నా దగ్గిర కొచ్చేడన్నమాట. అసలే మినిస్టరుగారి రాక; అందులో దళిత వర్గాలకోసం నిర్మించే గృహసముదాయానికి శంకుస్థాపన! ఎంత చిన్న పొరపాటు జరిగినా స్థానిక నాయకుల దగ్గిర్నుంచీ పత్రికా విలేకర్ల వరకూ ఎంతెంత గొడవలు చేస్తారో అని భయపడి చస్తున్న నాకు కొండలరావుని ఈ సందర్భంగా చూసేసరికి కొండంత ధైర్యం వచ్చింది.

సైటుకి వెళ్లేం. ఆ ఏరియా అంతా చదును చేయించుకోలేదే అన్నాడు కొండలరావు. కాంట్రాక్టు ఓకే అయ్యాక అదంతా చేస్తారన్నాం. కనీసం శంకుస్థాపన రాయిచుట్టూరా ఐదారు వందల గజాల మేరకి అయినా చదును చేయించకపోతే మీటింగు కొచ్చిన వాళ్లకి సదుపాయంగా ఉండదన్నాడు. వెండితాపీ - అన్నాడు చేయించి ఉంచింది చూపించేం.

ఇన్విటేషన్ కార్డు ఆమూలాగ్రంగా అక్షరం అక్షరం చూసేడు. ఓకే చేసేడు.

రేపు ఉదయం విమానంలో మంత్రిగారు దిగుతారనగా ఈ సాయంకాలం "చిన్న సమస్య" అన్నాడు కొండలరావు. "శంకుస్థాపన కోసం సిమెంటూ ఇసకా కలిపే "బొచ్చె" (గంప, పళ్లెం, బేసిను - ఏదో ఒకటి) నేను చూడాలి" అన్నాడు. మేస్త్రీని పిలిపించి తెప్పించి చూపించేను. "ఇది పనికి రాదు. ఇది కూడా వెండిదే ఉండా" లన్నాడు. "అసందర్భంగా మాట్లాడకు. ఇలాంటిది

వెండిది చేయించాలంటే రెండు కేజీల వెండి కావాలి. అయినా రాత్రికి రాత్రి ఎలా చేస్తారు?" అన్నాను. చిన్నది చేయిందు. మనం భోజనాలు దగ్గర పెట్టుకునే కూర బేసిన్ సైజుది చాలు" అన్నాడు. "అదైనా 750 గ్రాముల వెండి కావలిసొస్తుంది. ఈ డబ్బంతా ఎవరు పెట్టుకుంటారు?" అన్నాను. "తప్పదు, మినిస్టరుగారు శంకుస్థాపన చేసే సమయంలో ఈ బేసిన్ ఎడం చేత్తో పుచ్చుకుని, కుడి చేత్తో తాపీ పట్టుకుని-" అంటూ సోదాహరణ ఆంగిక ప్రసంగంచేసి కొండలరావు కొండంత సమస్య తెచ్చిపెట్టాడు. మా సంభాషణ అంతా ఇంట్లో జరగడం వల్ల అది మా అమ్మ వినడం, ఒక పాతకాలం నాటి ఇత్తడి పళ్లెం తెచ్చి దీనికి వెండి మలామా వేయించి పని కానిమ్మని సూచించడం అయింది. కొండని తవ్వి ఎలకని పట్టినట్టయినా రాజీకొచ్చేం.

మర్నాడు ఫంక్షన్ అయిపోగానే సైట్‌లోనే వెండితాపీ ఇత్తడి, వెండి మలామా- పళ్లెం కడిగించి ఒక సంచిలో పెట్టి మినిస్టర్ గారి వెంట వచ్చిన ఆత్మీయుడికి వప్పగించేడు కొండలరావు. "అదేమిటి?" అన్నాను. "అదంతే. అవి రెండూ మినిస్టర్ గారికి చెందుతాయి" అన్నాడు. "అయ్యో, ఆ పళ్లెం మా అమ్మ పెళ్లినాటిదోయి. ఏదో వెండి మలామా చేయిస్తే మరో పది కాలాలపాటు ఉంటుందని ఆవిడ ఆశపడి ఇచ్చింది పాపం;" అన్నాను. "ఎట్టి పరిస్థితుల్లోనూ అది వెనక్కిరాదు" అన్నాడు కొండలరావు. "గోడకి పూసిన సున్నం వేశ్యకి పోసిన వెల -" అన్లేదు.

ఆ రాత్రి మినిస్టరు గారూ మా ఆఫీసర్ గారూ మిగిలిన వి.ఐ.పి.లూ ఎక్కడో పోష్ హోటలుకి డిన్నరు కెళితే కొండలరావుని మా ఇంటికి తీసికెళ్లేను. "ఈ పళ్లెం నా దగ్గిర తప్ప ఎక్కడున్నా వాళ్లకి కష్టాలు తెస్తుంది బాబూ. దానికి మంత్రం వేసి వుంది." అంది మా అమ్మ. "పోతే పోనివ్వండి" అన్నాడు కొండలరావు.

సరిగ్గా ఆరు రోజుల తరవాత కొండలరావు హైదరాబాదు నుంచి పనిగట్టుకుని వచ్చి ఆ పళ్లెం తెచ్చి ఇచ్చేసేడు. "మినిస్టర్ గారికి ఉద్వాసన చెప్పేరు, తెలుసుకదా? నాకు రివర్షన్ రాకుండా చూసుకోవాలి. అందుకు" అన్నాడు.

★

# 55. కిటికీ పక్కసీటు

**మొ**న్నీమధ్య ఓనాడు నేను బెజవాడ నించి బందరుకి బస్సులో వెళ్లవలసి వచ్చింది.

"ఉంకో గంటవరకూ నాన్‌స్టాప్ బస్సులేదు; ఆడ్నరీ బస్‌లో ఎళిపోండి" అన్నారు డిపో అధికారి ఒకరు. టిక్కెట్లు మాత్రం ముందుగానే తీసుకోమన్నారు. సరేకదా అని లైను కాసి టిక్కెట్టు తీసుకుని, దాని వెనకాల రాసిన నెంబరుగల బస్సుని వెతుక్కుని లోపల ప్రవేశించేను. నాకన్నా ముందుగా కొందరు బస్సులో ఎక్కి కూర్చున్నా; సీట్లలో వేసిన రుమాళ్లూ, తుండు గుడ్డలూ, చేతి సంచీలు లెక్కపెడితే బస్సులో కూర్చున్న మనుషుల సంఖ్య కంటె వీటి సంఖ్య ఎక్కువగా తేలింది; నాకు ఎక్కడ కూర్చుందామన్నా ఏదో ఒక అడ్డు ఉన్నట్టే తేలింది. చివరికి ఒకచోట వాదిగి కూర్చున్నాను. నేను కూర్చున్న ఒక నిమిషానికి ఒక యువకుడు నా వరసలోనే కుడివేపున్న మూడు సీట్ల బెంచీలో కిటికీ పక్కసీట్లో స్థిరపడి అక్కడున్న చేతి సంచీతీసి ఇటువేపు పెట్టాడు. మరో రెండు నిమిషాలకి ఇంకో యువకుడు వచ్చి ఇతనితో "లెగు." అన్నాడు.